క్లుప్తంగా

కోనకాలువ శుభ్రం

ఉదయగిరి: పట్టణ ప్రజల దాహార్తిని తీర్చే ఉదయగిరి దుర్గంపై ఉన్న కోనకాలువను పంచాయతీ సిబ్బంది శుక్రవారం శుభ్రం చేశారు. దీంతో కొండపైనుంచి జాలువారే ఔషధ గుణాలతో కూడుకున్న పరిశుభ్రమైన తాగునీరు పట్టణ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. సర్పంచ్ సామ్రాజ్యం, ఉపసర్పంచ్ ముర్తుజాహుస్సేన్, పంచాయతీ కార్యదర్శి కరిముల్లా పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ కార్యవర్గ ఎన్నిక



ఉదయగిరి: మండల ఫొటోగ్రాఫర్స్ యూనియన్ కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఓంకారం వెంకట ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా పీ నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా అశోక్, కోశాధికారిగా పవన్‌కుమార్, గౌరవాధ్యక్షులుగా నారాయణ, కృష్ణమూర్తి, రఫీ ఎన్నికయ్యారు.

డీసీఓ తనిఖీలు



సంగం: స్థానిక పీఏసీఎస్‌ను డీసీఓ గురప్ప శుక్రవారం తనిఖీ చేశారు. ఎరువుల అమ్మకాలు, స్టాక్ వివరాలను సీఈఓ దస్తగిరిని అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులు అందించాలని సూచించారు. అనంతరం సహకార సంఘ పెట్రోల్ బంక్‌ను పరిశీలించారు.

వైఎస్సార్‌టీఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ



సోమశిల: వైఎస్సార్‌టీఎఫ్ నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్లను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు మెట్టుకూరు సుబ్బారెడ్డి, శివశంకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మునీర్‌బాషా, జిల్లా గౌరవాధ్యక్షులు రఘురామిరెడ్డి, ఎస్ భాస్కర్‌రెడ్డి, ఎస్ డానియేల్, ఏ సురేష్, శ్రీలత, ఆదిశేషయ్య, అల్లాబక్షు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

వింజమూరు(ఉదయగిరి): ఉదయగిరి నియోజకవర్గ సెక్రటేరియట్ ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వింజమూరులోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తమను మాతృశాఖలో కలపాలని ఎమ్మెల్యేను కోరారు. డీఈ ఫణికుమార్, ఏఈలు శ్రీనివాసరాజు, తిరుమలయ్య, రవీంద్ర, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

టెస్ట్ పేపర్ల పంపిణీ

చేజర్ల: మాముడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు యూటీఎఫ్ మోడల్ టెస్ట్ పేపర్లను గురువారం పంపిణీ చేశారు. ఎస్‌ఆర్‌ఐ గణపతిరెడ్డితో పాటు ఆర్యావారుసెట్టి చెంచురత్నం జ్ఞాపకార్థంగా సతీమణి రత్నమ్మ అందించిన ఆర్థిక సహకారంతో 250 మంది విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లు ఉచితంగా అందజేశారు. యూటీఎఫ్ నాయకులు ఎస్ రమణయ్య, జీ సుబ్రమణ్యం, ఎం రవిబాబు, ఏ సుబ్రహ్మణ్యం, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

కావలి: ఏపీఎస్పీడీసీఎల్ 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సమర్పించిన విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఈ నెల 7, 8,10 తేదీల్లో ప్రజాభిప్రాయాలను సేకరించనున్నట్లు కావలి డివిజన్ ఈఈ కేఎస్ బెనర్జీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7,8 తేదీల్లో విజయవాడలోని 'ఏ' కన్వెన్షన్ సెంటర్‌లో, 10న కర్నూలులోని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నేరుగానూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారానూ వినియోగదారుల అభిప్రాయాలను స్వీకరించనున్నట్లు చెప్పారు. పట్టణంలోని ఉదయగిరి రోడ్డులో ఉన్న విద్యుత్ ఈఈ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయాలను తెలిపేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు.

కోడిపందేల స్థావరంపై దాడులు

కావలి: పట్టణంలోని బుడంగుంట ప్రాంతంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో కావలి రూరల్ ఎస్సై సీహెచ్ తిరుమలరెడ్డి తన సిబ్బందితో కలిసి శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కోడిపందేలు ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.6,400 నగదు, 4 కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోడిపందేలు ఆడుతున్న వారిని అరెస్ట్ చేసినట్లు కావలి రూరల్ సీఐ రాజేశ్వరరావు తెలిపారు.

మా దారి..రహదారి

పట్టణంలోని రోడ్లపై పశువుల సంచారం

- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- పాదచారులపైన దాడి
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న పట్టణ ప్రజలు





పట్టణంలోని ట్రంకురోడ్డులో అడ్డదిడ్డంగా తిరుగుతున్న పశువులు

కావలి: పట్టణంలోని రోడ్లపై పశువులు స్వైరవిహారం చేస్తున్నాయి. విచ్చలవిడిగా తిరుగుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి. వాహనదారులను ప్రమాదాలకు గురిచేస్తున్నాయి. పాదచారులపైన దాడులకు పాల్పడుతున్నాయి. దుకాణాల్లోని వస్తువులను తినేస్తూ వ్యాపారులను హడలెత్తిస్తున్నాయి. రోడ్లపై పశువుల సంచారాన్ని కట్టడి చేయాల్సిన మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

350కుపైగా పశువులు

పట్టణంలో రోడ్లపై సుమారు 350కుపైగా పశువులు సంచరిస్తున్నాయి. ట్రంక్ రోడ్డుతో పాటు ఉదయగిరి రోడ్డు, తుమ్మలపెంటరోడ్డు, సినిమాహాలు రోడ్డు, విష్ణాలయం వీధి, కొత్త బజారు, రైల్వేరోడ్డు, తదితర ప్రాంతాల్లో పశువుల సమస్య తీవ్రంగా ఉంది. పట్టణంలోని ట్రంకురోడ్డు కొన్నేళ్లుగా విస్తరణకు నోచుకోక ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీనికితోడు ట్రంకురోడ్డులో పశువులు తిష్ట వేసి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు వాహనదారులకు అకస్మాత్తుగా అడ్డువస్తూ ప్రమాదాలకు గురి చేస్తున్నాయి. వాహనాలు ఢీకొని మూగజీవాలు సైతం గాయపడుతున్నాయి. మరోవైపు పశువుల దాడిలో గాయపడి ఆస్పత్రుల్లో చేరిన బాధితులు ఉన్నారు.

మంత్రి ఆదేశించినా..

మున్సిపాలిటీల పరిధిలో రోడ్లపై పశువులు సంచరిస్తే ఉపేక్షించేది లేదని జిల్లాకు చెందిన రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ హెచ్చరించారు. అయినప్పటికీ కావలి మున్సిపల్ అధికారులు పశువుల కట్టడికి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో కావలి మున్సిపాలిటీకి బందెల దొడ్డి ఉండేది. వీధుల్లో విచ్చలవిడిగా తిరిగే పశువులను బంధించి అందులో ఉంచేవారు. పశువుల యజమానులు జరిమానా చెల్లించి తీసుకెళ్లేవారు. బందెలదొడ్డి నిర్వహణకు వార్షిక బడ్జెట్లో కొంత మొత్తాన్ని కేటాయించేవారు. దీంతో పశువులను రోడ్లపైకి వదిలితే జరిమానా చెల్లించాల్సి వస్తుందని యజమానులు భయపడి ఇళ్లలోనే కట్టేసుకునే వారు. ఇటీవల మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో బందెలదొడ్డి కాలగర్భంలో కలిసిపోయింది. పురపాలక చట్టం ప్రకారం రోడ్లపైకి పశువులను వదిలే యజమానులపై కేసులు పెట్టొచ్చు. కోర్టుల ద్వారా జరిమానాలు, శిక్షలు పడేలా చేయవచ్చు. కానీ అధికారులకు చట్టాలపై సరైన అవగాహన, అమలుపై శ్రద్ధ లేక అమలుకు నోచుకోవడం లేదు. వాస్తవానికి రోడ్లపై వెళ్లేవారి ప్రాణాలకు ముప్పుగా మారిన పశువుల విషయంలో వాటి యజమానులపై పోలీసులు కేసులు పెట్టవచ్చు. పశువులను రోడ్లపైకి వదిలి అవి గాయాలపాలయ్యేందుకు కారకులైన యజమానులపై జంతు హింసా నిరోధక చట్టం–1960 ప్రకారం పశుసంవర్ధక శాఖ అధికారులు కూడా చర్యలు చేపట్టవచ్చు. పట్టణంలో పశువుల కారణంగా ఉత్పన్నమవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు గతంలో ఢిల్లీ హైకోర్టు ఆదేశించినట్లుగా బందెలదొడ్డిని ఏర్పాటు చేయాలి. వాటి నిర్వహణకు నిధులను, సిబ్బందిని, వాహనాలను మున్సిపల్ అధికారులు సమకూర్చాలి. జరిమానా మొత్తాలను పెంచితే, పశువులను రోడ్లపైకి వదలడానికి యజమానులు జంకుతారు. ఈ విషయంలో ఎలాంటి రాజకీయాలకు తావివ్వకూడదు. రోడ్లపై చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించాలి. హోటళ్ల నిర్వాహకులు ఆహార వ్యర్థాలను వీధుల్లో పారబోయకుండా చర్యలు తీసుకోవాలి. ప్రజలు సైతం రోడ్లపై తిరిగే పశువులకు ఆహారాన్ని అందించడాన్ని మానివేయాలి. పోలీసు, పశుసంవర్ధక శాఖ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేస్తే రోడ్లపై పశువుల సంచారాన్ని కట్టడి చేయవచ్చు.

బెంబేలెత్తుతున్న వ్యాపారులు

పట్టణంలోని వ్యాపారులు పశువుల కారణంగా బెంబేలెత్తుతున్నారు. ట్రంకురోడ్డుకు ఇరువైపులా పండ్లు, కూరగాయలు, టిఫిన్ షాపులు, ప్రొవిజన్ షాపులు ఉన్నాయి. వ్యాపారులు ఆదమరిచి ఉంటే పశువులు దాడి చేసి వస్తువులను తినడంతో పాటు చిందరవందర చేస్తూ నష్టాన్ని కలుగజేస్తున్నాయి. వ్యాపారులు గమనించి తరిమేస్తే కదిలి మరోచోటకు పోవడం నిత్యకృత్యంగా మారింది. ప్రధానం రైతుబజార్ పరిసర ప్రాంతాల్లో పశువుల సమస్య తీవ్రంగా ఉంది.

పశువుల కట్టడికి చర్యలు

పట్టణంలోని రోడ్లపైకి పశువులను వదలకుండా కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. పశువులను రోడ్లపైకి వదలకుండా కట్టేసుకోవాలని యజమానులకు సూచిస్తాం. అయినా ఉపేక్షిస్తే పశువులను బందిలదొడ్డి లేదా ఆలయాల గోశాలలకు తరలించడమో చేస్తాం.

– శ్రావణ్‌కుమార్, కమిషనర్, కావలి పురపాలక సంఘం

24 గంటల్లోగా బకాయిలు చెల్లించాలి

- ఏరియా ఆస్పత్రి షాపింగ్ కాంప్లెక్స్ లీజుదారులకు ఎమ్మెల్యే అల్టిమేటం

కావలి: కావలి ఏరియా ఆస్పత్రి షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపులు అద్దెకు తీసుకుని లీజు బకాయిలు చెల్లించని వారిపై కఠిన చర్యలకు వెనుకాడబోం. శనివారం సాయంత్రంలోగా బకాయిలు చెల్లించకుంటే షాపులకు తాళాలు వేస్తామని కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి అల్టిమేటం జారీ చేశారు. కావలి ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. చైర్మన్ హోదాలో ఎమ్మెల్యే పాల్గొని ఆస్పత్రి అభివృద్ధిపై వైద్యులతో సమీక్షించారు. ఆస్పత్రిలోని సమస్యలు, సదుపాయాలు, రోగులకు అందిస్తున్న సేవలపై చర్చించారు. ఈ సందర్భంగా షాపింగ్ కాంప్లెక్స్‌కు సంబంధించి రూ.11లక్షల మేర బకాయిలు పేరుకుపోయిన విషయాన్ని ఎమ్మెల్యే తెలుసుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రంలోగా లీజుదారులు బకాయిలు చెల్లించకుంటే పోలీసుల సమక్షంలో షాపులకు తాళాలు వేస్తామని స్పష్టం చేశారు. ఆస్పత్రి అభివృద్ధికి సంబంధించి రూ.29లక్షల మేర నిధులు సిద్ధంగా ఉన్నాయని, బకాయిలు కూడా వసూలైతే మొత్తం రూ.40లక్షలతో అభివృద్ధి పనులు చేసేందుకు, రోగులకు అవసరమైన వసతులు కల్పించేందుకు అవకాశం ఉంటుందన్నారు. వైద్యులు అంకితభావంతో వైద్యసేవలు అందించి అవుట్ పేషెంట్లను పెంచాలన్నారు.ఆస్పత్రిలో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

వసతిగృహంలో వన్‌మ్యాన్ కమిషన్ చైర్మన్ ఆకస్మిక తనిఖీ

మర్రిపాడు: మండలంలోని సాంఘిక సంక్షేమ బాలబాలికల వసతిగృహాన్ని ఎస్సీ ఉపవర్గీకరణ వన్‌మ్యాన్ కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంగన్ మిశ్రా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహంలో బాలబాలికలకు కల్పిస్తున్న వసతి సదుపాయాలను వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. బాలుర వసతిగృహంలోని విద్యార్థులతో స్టడీ ప్రోగ్రెస్‌ను తెలుసుకుని పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి స్టడీ అవర్స్‌లో సందేహాలను నివృత్తి చేసుకోవాలని చెప్పారు. జిల్లా లైజినింగ్ అధికారి శ్రీనివాసులు, వార్డెన్ పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



ఆత్మకూరు: అనంతపురం జిల్లాలో బార్ అసోసియేషన్ సభ్యుడైన సీనియర్ న్యాయవాది శేషాద్రి మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి అందుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ఆత్మకూరు నాయవాదులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విధులు బహిష్కరించి ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. అనంతపురంలోని మూడో పట్టణ సీఐ శాంతిలాల్ విచారణ పేరుతో శేషాద్రిని స్టేషన్‌కు పిలిపించి తీవ్రంగా దుర్భాషలాడడంతో పాటు దండించడంతో మనస్తాపంతో తీవ్ర ఒత్తిడికి గురై మృతి చెందారన్నారు. సివిల్ కేసుల్లో పోలీసులు జోక్యం చేసుకోరాదని సుప్రీంకోర్టు పదేపదే చెబుతున్నా పాటించకపోవడం దారుణమన్నారు. న్యాయవాదులు శేషారెడ్డి, రమణయ్య, ఓబులేసు, తిరుపతమ్మ, హరికృష్ణ, రహమతున్నీసా, సురేష్, రసూల్, మల్లికార్జున పాల్గొన్నారు.

జొన్నవాడకు బస్సు సర్వీసు ప్రారంభం



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న లక్ష్మీసంపూర్ణమ్మ

కావలి: కావలి ఆర్టీసీ బస్టాండ్ నుంచి జొన్నవాడ క్షేత్రానికి బస్సు సర్వీసును జొన్నవాడ ఆలయ నిర్మాణకర్త ద్రోణాదుల లక్ష్మీసంపూర్ణమ్మ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి శుక్రవారం జొన్నవాడ క్షేత్రానికి భక్తులు వెళ్లి అమ్మవారిని దర్శించుకుని రాత్రి బస చేయడం ఆనవాయితీ అని తెలిపారు. గతంలో కావలి నుంచి జొన్నవాడ క్షేత్రానికి ఉన్న బస్సు సర్వీసును సరైన ఆదాయం రావడంలేదని ఆర్టీసీ అధికారులు రద్దు చేశారని చెప్పారు. అప్పట్నుంచి భక్తులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. బస్సు సర్వీసును పునఃప్రారంభించడం సంతోషకరమని పేర్కొన్నారు. డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం సాయంత్రం 6 గంటలకు కావలి నుంచి బస్సు బయలుదేరుతుందని చెప్పారు. అల్లూరు, కొడవలూరు, రాజుపాళెం, బుచ్చిరెడ్డిపాళెం గ్రామాల మీదుగా జొన్నవాడకు రాత్రి 8 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. శనివారం ఉదయం 6 గంటలకు తిరిగి బయలుదేరి అదే మార్గంలో కావలికి చేరుకుంటుందని వివరించారు. భక్తులు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. అసిస్టెంట్ మేనేజర్లు కల్పన, విజయకుమారి, ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఎం రామకృష్ణ, బస్టేషన్ మేనేజర్ రమేష్‌బాబు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డీ రవిప్రకాష్, సెక్యూరిటీ అధికారి కే రావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్దు బాబోయ్

- జలదంకి మండలంలో మహిళల నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

జలదంకి: మండలంలోని కోదండరామపురంలో కొత్తగా మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దంటూ ఆ గ్రామానికి చెందిన మహిళలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన రామిశెట్టి రామమూర్తి కోదండరామపురంలోని తన స్థలంలో షెడ్ నిర్మిస్తున్నాడు. మహిళలు అక్కడికి వెళ్లి ఇక్కడ మద్యం దుకాణం వద్దంటూ పనులను ఆపివేశారు. రామమూర్తి మాత్రం తాను గేదెల షెడ్ నిర్మించుకుంటున్నానని వారికి చెప్పాడు. తమకు సమాచారం వచ్చిందని, పనులను ఆపివేయాలన్నారు. దీంతో జలదంకి పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మహిళలను, షెడ్ నిర్మిస్తున్న వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. రామమూర్తి మహిళలపై ఫిర్యాదు చేశాడు. మహిళలు మద్యం దుకాణం వద్దంటూ పోలీసులకు తెలిపారు. అక్కడ షాపు ఏర్పాటు చేసినప్పుడు నిరసన తెలపాలి కానీ ఇప్పుడు అడ్డుకోవడం సరికాదని మహిళలకు పోలీసులు సూచించారు.

బిలకూటక్షేత్రం అభివృద్ధి పనుల పరిశీలన



బిట్రగుంట: అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి

బిట్రగుంట: కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం ప్రతిష్ట ఇనుమడించేలా భక్తుల అభీష్టానికి అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. బిలకూట క్షేత్రాన్ని శుక్రవారం ఆయన దర్శించారు. క్షేత్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, భక్తులకు కల్పిస్తున్న వసతులు, తదితరాలను పరిశీలించారు. తూర్పురాజగోపురం, కోనేరు నిర్మాణాలు, గిరిప్రదక్షిణ జరిగే ప్రాంతంతో పాటు ఇటీవల భూమిపూజ నిర్వహించిన మహాప్రాకార నిర్మాణ పనులను పరిశీలించి సూచనలు చేశారు. బిలకూట క్షేత్రాన్ని పవిత్ర ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయించడంతో పాటు భక్తులకు శాశ్వత ప్రాతిపదికన వసతులు కల్పించనున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే వెంట ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి, ఈఓ రాధాకృష్ణ, టీడీపీ మండల కన్వీనర్ మాలె పాటి నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

వాడివేడిగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి

చేజర్ల: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. పలువురు ప్రజాప్రతినిధులు ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి విచారణ జరిపించాలని కోరారు. ఉపాధి పథకం కింద మినీగోకులాల నిర్మాణాలకు సంబంధించి 71 దరఖాస్తులు అందగా, 59 మందికి మంజూరు చేయడంలో ఆంతర్యమేమిటని ఏపీఓ వెంకటేశ్వర్లును ప్రశ్నించారు. మంత్రి చెప్పిన వారికే ఇస్తారా అని నిలదీశారు. అందుకు ఏపీఓ బదులిస్తూ 71 దరఖాస్తులు రాగా, పశువైద్యులు ఎంపిక చేసిన 59 మందిని జిల్లా డ్వామా అధికారులకు పంపించామని, వారి ఆదేశాల మేరకు మంజూరు చేశామని తెలిపారు. ఎంపీపీ తూమాటి మాట్లాడుతూ మండలంలోని సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. మండలంలో విద్యుత్ సమస్య అధికంగా ఉందని, 11 కరెంట్ పోల్స్ దెబ్బతిన్నాయని వాటిని వెంటనే మార్చాలని విద్యుత్ అధికారులకు సూచించారు. తాగునీటి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. మాజీ ఎంపీపీ బాలిరెడ్డి రమాదేవి, వైస్‌ఎంపీపీ తిరుపతినాయుడు, తహసీల్దార్ మురళి, ఎంపీడీఓ విజయలలిత, తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే ఆదర్శప్రాయురాలు



కావలి: సావిత్రిబాయికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ శ్రీదేవి



కావలి: రామ్మూర్తిపేట మున్సిపల్ పాఠశాలలో..



ఏఎస్‌పేట కేజీబీవీలో ఉపాధ్యాయినులకు సత్కారం



ఆత్మకూరురూరల్: కరటంపాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో



ఆత్మకూరు: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..



ఆత్మకూరు: ఎల్‌ఆర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో..



సీతారామపురం: ఉపాధ్యాయినులకు సత్కారం



సోమశిల: చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో..



సంగం ఉన్నత పాఠశాలలో..

కావలి: దేశ తొలి మహిళా ఉపాధ్యాయినిగా సావిత్రిబాయి పూలే స్త్రీ విద్య కోసం ఎంతో పాటు పడ్డారని, ఆమె జీవితం మహిళా లోకానికి ఆదర్శనీయమని ఎంపీడీఓ సీహెచ్ శ్రీదేవి అన్నారు. డాక్టర్ రామ్ సెంటర్, విశ్వోదయ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఇందిరానగర్‌లోని మున్సిపల్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ శ్రీదేవి ముఖ్యఅతిథిగా హాజరై పూలే చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. సావిత్రిబాయి సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్పమానవతావాది అని కొనియాడారు. డాక్టర్ రామ్ సెంటర్ డైరెక్టర్ కూనం తాతిరెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాలు, సతీసహగమనాలకు వ్యతిరేకంగా తన భర్త జ్యోతిరావు పూలేతో కలిసి పోరాడిన వీరవనిత సావిత్రిబాయి అని తెలిపారు. సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, హెచ్‌ఎం సుగుణమ్మ, ఉపాధ్యాయులు చాముండేశ్వరి, కవిత, మరియమ్మ, అరుణ, సుమలత, అంగనవాడీ కళావతి, తదితరులు పాల్గొన్నారు.

- రామ్మూర్తిపేట మున్సిపల్ పాఠశాలలో కలయిక విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో సావిత్రిబాయి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కలయిక కన్వీనర్ ఇలింద్ర లావణ్య, అడ్వైజర్ సీ శారద మాట్లాడుతూ సావిత్రిబాయి జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు కిషోర్, రాజ్యలక్ష్మి, కలయిక విజ్ఞానకేంద్రం కన్వీనర్ రాంప్రసాద్, కార్యవర్గసభ్యులు హరనారపరెడ్డి, ఎం అరుణ, ఎస్ సాయిరాం, ప్రసాద్, హరనాథ్ పాల్గొన్నారు.

బిట్రగుంట: కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సావిత్రిబాయి చిత్రపటానికి అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.నెల్లూరు అపోలో ఆస్పత్రి సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ పీ స్రవంతి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కలిగించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పీఎంఎన్‌రెడ్డి, ఏఓ ఆర్వీ రమణారెడ్డి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం అనంతలక్ష్మి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయినులు లక్ష్మీకుమారి, వినోద, అనంతలక్ష్మిని ఘనంగా సన్మానించారు. అలాగే ఆత్మకూరు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కోటేశ్వరమ్మ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు పద్మమ్మ, తదితరులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ బస్టాండ్ సమీపంలోని ఆది ఆంధ్ర ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి చిత్రపటానికి ఉపాధ్యాయులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తాటిపర్తి పెంచలయ్య, లక్కు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎల్‌ఆర్‌పల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త షేక్ షకీల ఆధ్వర్యం సావిత్రిబాయికి నివాళులర్పించారు.

ఆత్మకూరురూరల్: సావిత్రిబాయి జయంతిని పురస్కరించుకుని కరటంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయినులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. బండారుపల్లి ఎంపీయూపీ పాఠశాలలో హెచ్‌ఎం పెంచలయ్య, ఉపాధ్యాయులు సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పించి ఆమె జీవిత విశేషాలను విద్యార్థులకు తెలియజేశారు. అలాగే శ్రీనివాసపురంలో అభ్యుదయ మహిళా మండలి, మానవ హక్కుల సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయికి నివాళులర్పించారు. అభ్యుదయ మహిళా మండలి అధ్యక్షురాలు జయలక్ష్మి పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ప్రిన్సిపల్ లక్ష్మి ఆధ్వర్యంలో సావిత్రిబాయికి నివాళులర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయినులు రుక్సానా బేగం, కే శైలజ, డీవీ భార్గవిని సన్మానించారు. సావిత్రిబాయి సామాజిక సేవలను విద్యార్థినులకు వివరించారు.

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లి జెడ్పీ హైస్కూల్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూటీఎఫ్ నాయకులు రవిబాబు, రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి చిత్రపటానికి ఎంఈఓ మస్తాన్‌వలి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయినులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. సీతారామపురం, బసినేనిపల్లి, ఓగూరువాండ్లపల్లి, అయ్యవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోమశిల: అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి చిత్రపటానికి హెచ్‌ఎం సురేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. జ్యోతిరావు, సావిత్రిబాయి వేషధారణలో విద్యార్థులు చైత్ర, హరిత ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, మహేష్, వెంకటేశ్వర్లు, మదీనా, కృష్ణారెడ్డి, మాధవి, సురేష్, పెద్దయ్య పాల్గొన్నారు.

సంగం: సంగం, దువ్వూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో సావిత్రిబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సంగం హైస్కూల్ హెచ్‌ఎం బుజ్జయ్య, ఉపాధ్యాయులు దేవసేన, ఉమ, మంజూష, శివకోటయ్య, మోహన్‌రావు, కృష్ణ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ సదస్సు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుధీర్ శుక్రవారం తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రైతులు తమ భూసమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

మున్సిపల్ పార్కును అభివృద్ధి చేస్తా

కావలి: పట్టణంలోని వెంగళరావునగర్‌లోని మున్సిపల్ పార్కును మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005లో తన తల్లిదండ్రులు వంటేరు వరదారెడ్డి–తాయమ్మ పేర్లపై సొంత నిధులతో పార్కును అభివృద్ధి చేసి మున్సిపాలిటీకి అప్పగించినట్లు తెలిపారు. ప్రస్తుతం పార్కు అధ్వాన స్థితికి చేరిందని, తన సొంత నిధులతో ఆధునీకరించి ప్రజలకు ఆహ్లాదాన్ని అందిస్తామని వెల్లడించారు.

వైభవంగా మహాలక్ష్మమ్మ తిరునాళ్ల

అల్లూరు: బలిజపాళెంలో మహాలక్ష్మమ్మ తిరునాళ్లను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పూలంగిసేవ, విశేష పూజలు నిర్వహించారు. రాత్రి మహాలక్ష్మమ్మను విశేషంగా అలంకరించి గ్రామోత్సవం జరిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉదయగిరి: ఉదయగిరి 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా ఉదయగిరి, కుర్రపల్లి, బిజ్జంపల్లి, గండిపాళెం, చినమాచనూరు, వరికుంటపాడు, దుత్తలూరు, నర్రవాడ, బ్రాహ్మణపల్లి, కృష్ణాపురం, సీతారామపురం సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఉదయగిరి డీఈ కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.